# మాతృమూర్తి

## కె. సత్య

> **పైట సరిలేక చిరిగిన జాకెట్టులోనుండి కనబడే ఎత్తుపల్లాలను ఆకలిగా చూస్తున్నాడు డాక్టరు-మెల్లగా వంగి రంగిని లేవదీసి తన కోర్కె తీర్చమని తరువాత సిన్నోణ్ణి బ్రతికిస్తానని చెప్పాడు ఎక్కడికెళ్ళినా కోర్కెతో చూసేవారే...**

మావ ఇంటికి సేరాడో లేదో—

సిన్నోడెలా వున్నాడో—

బొడ్లో చెంగుతీసి నుదిటికి పట్టిన చెమటను తుడుచుకుంటూ అనుకుంది రంగి అప్పటికెన్నోసారో—

అమ్మగారూ పనంతా అయ్యింది, వెళ్ళొస్తానమ్మా! చెప్పింది రంగి. వెళ్ళు — అంది లక్ష్మి.

కానీ వెళ్ళకుండా ఇంకా అక్కడే నిలబడి చూస్తున్న రంగివైపు చూసింది ఏమే ఇంకా అక్కడే నిలబడ్డావ్!

మా సిన్నోడికి పెదాలమీద కొచ్చిందమ్మా! ఓ ఇరవై రూపాయలుంటే ఇప్పించండి కన్నీళ్ళతో అడిగింది రంగి—

నీకు ఎప్పుడంటే అప్పుడు డబ్బురావడానికి పెరట్లో చెట్టుమొలేశావనుకున్నావా! ఏంటీ!

అయినా ఇంకా జీతాలందలేదు. వెళ్ళు! కసిరినట్లే చెప్పింది లక్ష్మి— ఇరవై రూపాయలక్కాడా జీతాలందాలా అనే ప్రశ్నరాలేదా రంగికి— తలవంచుకుని వచ్చేసింది

* * *

సిన్నోడికి వారం రోజులనుండీ వాంతులవ్వాయ్—

కానీ డాటరు కాడికి సూపిద్దునా అంటే సేతిలో పైసా లేదు ఈరోజైనా తాగకుండా రా మావా! అంటే అట్టాగే అని సాయంత్రానికి మామూలుగానే వత్తాడు—

బిడ్డ ఏమైపోయినా ఆడికి పట్టదు, తాను పనిలోకెళ్ళకపోతే ఆ అమ్మగారికి కోపమెత్తిత్తే—

కుక్కిమంచంలో డొక్కలెగరేస్తూ, కళ్ళుతేలేస్తూ జ్వరంతో ఒళ్ళు పెనంలా కాలిపోతుంది— మగతలోవున్న సిన్నోణ్ణి చూస్తుంటే రంగికి ఏం చేయాలో తోచటంలేదు— ఈ రోజన్నా మందుమీద రాడన్న నమ్మకంతో ఎదురు చూస్తుంది రంగి—

కానీ మామూలు మైకంతో వచ్చాడు మావ—

దొంగ సచ్చినోడు— మాటకిలువలేకుండా బతుకుతాడు యెధవ బతుకు, బతికినా ఒకటే సచ్చినా ఒకటే— కనీసం సిన్నోడికి నూకల్జావైనా కాద్దానా అంటే నూకలు నిండుకున్నాయ్ .

సేతిలో పైసా లేదు—

మరోకసారి పెట్టెలన్నీ వెతికింది—

పెట్టెకున్న రెండు క్కర్రల సందులో ఓ రూపాయి కాను ఇరుక్కుని వుంది— రంగి కళ్ళు ఆనందంతో మెరిశాయ్ —

ఆ క్షణంలో ఆ రూపాయి కేమొస్తుంది అనే ఆలోచనకంటే ఆ రూపాయే వంద రూపాయలన్నంత సంతోషంలో చెంగున ముడేసుకుంది.

సిన్నోడ్ని బుజానేసుకుంది—

అప్పటికే చిరుచీకట్లు కమ్ముకున్నాయ్ —

మొదట డాక్టర్ దగ్గరకెళ్ళితే అన్న ఆలోచన వచ్చిన వెంటనే— ఆ వీధి చివర్నున్న పేదల పాలిట దైవం అని సన్మానం చేసుకున్న డాక్టర్ వద్దా?—

వెళ్ళిన తరువాత తెల్సింది ఫీజు అనేది కనీసం ఇరవై రూపాయలు అనే నోటు టేబుల్ పై పెడితేకానీ రోగి మొహం కూడా ఆ డాక్టర్ చూడడని—

కన్నీళ్ళ పైటతో తుడుచుకుని అమ్మగారి దగ్గరకెళ్ళితే సిన్నోణ్ణి చూసైనా ఓ పది రూపాయలైనా ఇవ్వరా అనే ఆశతో వెళ్ళింది రంగి—

అమ్మగారు సిన్మాకెళ్ళారు, ఏం కావాలి అని అడిగాడు సుబ్బారావ్—

మగతలో స్పృహ కోల్పోయి శవంలా వున్న కొడుకుని చూపిస్తూ ఓ పది రూపాయలివ్వమని అడిగింది—

రంగి చెప్పింది కనీసం వినకుండా రంగినే చూస్తున్నాడు సుబ్బారావ్— ఇంతకాలం పన్జేస్తున్నా కానీ సుబ్బారావ్ ఆకలి చూపుల్ని ఎప్పుడు గమనించలేదు రంగి—

పది రూపాయలేం కర్మ వందిస్తా? అని రంగి చేయిపట్టుకుని కౌగిలించుకో బోయాడు—

కానీ!

సుబ్బారావ్‌ను ఒక్క తోపుతోసి సిన్నోణ్ణి బుజానేసుకుని, రేగిన జుట్టు వెనక్కి త్రోసుకొని పరుగున బయటపడింది—

కానీ ఎటు వెళ్ళాలో తెలియటంలేదు—

ఇప్పుడు ఎలాగైనా డబ్బుసంపాదించాలి— డబ్బే తనకు ముఖ్యం—

కానీ ఎలా—

ఎదురుగా బస్‌స్టాండ్‌లో ధర్మం బాబూ అని చంకలో బిడ్డనేసుకుని అడుక్కుంటున్న ఓ తల్లిని చూసింది రంగి—

అడుక్కోవడం తప్పు అన్పించలేదు రంగి మనసుకు

వెంటనే, సిన్నోణ్ణి బుజాన సరిచేసుకుని—

బాబు ధర్మం... అంటూ చేయిచాచింది—

నా బిడ్డకి సానా జబ్బు చేసింది బాబూ! డాక్టరుకాడికి తీసుకుపోవాలి! బాబూ! ధర్మం! చేయండి అని చేయిచాపిన రంగి?—

అడుక్కోవడం పెద్ద ఫేషనైపోయింది ప్రతి దానికి అని ఒకడు— ఎత్తుపల్లాలు బానేవున్నాయ్ , అడుక్కోవడం ఖర్మే— అని ఇంకొకడు— ఈడు దానికొడుకో కాదో— ఎవరికి తెల్సు— దార్నిపోయేవాళ్ళ్ని బుజానేసుకుని ఇలా పైసలు దండుకుంటుందిరా! అని మరొకడు— ధర్మం చేయలేదు సరికదా! వాళ్ళనేమాటలు శూలాల్లా గుండెల్లో గుచ్చుకున్నాయ్ —

గుండె బరువులో సిన్నోణ్ణి తీసుకుని బయటపడింది

అక్కడున్న బోరింగు దగ్గర సిన్నోణ్ణి దింపి వాడి మొహం కడిగి— కాసిన్ని నీళ్ళు తాగి కడుపు నింపుకుంది—

అందరూ దేవుడు అనే డాక్టర్ గుర్తుకొచ్చి— ఆయన కాళ్ళు పట్టుకునైనా తన సిన్నాణ్ణి బతికించుకోవచ్చు అనే ఆశలో హాస్పటల్ కెళ్ళింది—

'సగం' మందులో కుర్చీలో కూర్చునున్న డాక్టర్ కాళ్ళు పట్టుకుంది రంగి— బాబూ! దాటరు బాబూ! నా సిన్నోణ్ణి ఎలాగైనా బతికించండయ్యా! ఏడుస్తూ, డాక్టర్ పాదాలకు తన బుర్ర కొట్టుకుంటూ చెప్పింది—

అప్పటికే సగం నిషాలోనున్న డాక్టర్‌కి— ఎదురుగా చనిపోయే స్థితిలో, మగతలో పడివున్న సిన్నోడి కంటే—

బిడ్డకోసం ప్రాణాలైనా ఇవ్వడానికి ఆ తల్లి పడే ఆరాటం కన్నా ఏడ్చి, ఏడ్చి ఇక కన్నీళ్ళన్నీ అయిపోయి గాజుకళ్ళులా తయారైన ఆ మాతృమూర్తి కన్నా—

పైట సరిలేక చిరిగిన జాకెట్టులోనుండి కనబడే ఎత్తుపల్లాలను ఆకలిగా చూస్తున్నాడు డాక్టరు—

మెల్లగా వంగి రంగిని లేవదీసి తన కోర్కె తీర్చమని తరువాత సిన్నోణ్ణి బ్రతికిస్తానని చెప్పాడు—

ఎక్కడికెళ్ళినా తన శరీరాన్ని కోర్కెతో చూసేవారే కన్పడుతున్నారు.

ఎన్ని నోములతో— ఎన్ని పూజలతో, తిరగని దేవత గుడిలేదు— చివరికి ఎన్నాళ్ళకు పుట్టాడీ సిన్నోడు—

కన్నుల్లో పెట్టుకుని పెంచింది—

అందరిలా బంగ్లాలలో పెంచలేక పోయినా— తన తాటాకు ఇల్లే బంగ్లాలా మార్చి పుట్టెడు ప్రేమతో



పెంచింది—

పరుపుల మీద పడుకోబెట్టలేకపోయినా— తన గుండెల్లో పెట్టుకుని నిద్రపుచ్చింది—

ఇన్ని చేసిన సిన్నోడు ఇప్పుడు చావుబతుకుల్లో వున్నాడు— ఆడు బతకాలంటే, తన మానాన్ని అమ్ముకోవాలి—

లేకపోతే తన నోములఫలం తనకళ్ళముందే పోగొట్టుకున్నదౌతుంది—

సిన్నోడా! నీకోసం తప్పదురా! ఏ తల్లీ ఎలాంటి త్యాగం చేసిందో నాకు తెలవదురా! కన్నా!

అని ఆ తల్లి హృదయం విలపిస్తుంటే!

ఆ డాక్టర్ పశువాంఛగా తన కోర్కె తీర్చుకున్నాడు.

చీర సరిచేసుకుని బాబూ! ఇప్పటికైనా సూడండి నా సిన్నోణ్ణి అని రెండు చేతుల్తో సిన్నోణ్ణి ఎత్తి డాక్టర్ ముందు పెట్టింది— నాడి చూసి డాక్టర్—

ఏంటే, చచ్చిన శవానికి బ్రతికినోడికి తేడా తెలియదా నీకు. శవాన్ని తీసుకొచ్చి బ్రతికించమంటే నేనేం దేముణ్ణా!

అన్న డాక్టర్ మాటలకి—

నోటమాటరాలేదు రంగికి—

బాబు! ఇక్కడకొచ్చేవరకు నా బిడ్డ బతికేవున్నాడు బాబూ!

నీ కోర్కె తరువాత తీర్చుకొని, ముందు నా బిడ్డను సూసుంటే నా బిడ్డ బతికేవుండేవాడు బాబు!

నా బిడ్డను నువ్వే చంపేశావ్‌రా! నువ్వే చంపేశావ్‌రా!

అరుస్తూ డాక్టర్ కాలర్ పట్టుకుని లాగుతుంటే—

వదలవే! ఫీజులేదు— ఏం లేదు— పోనీలే కదా అని. చూస్తే నేనే చంపేశానంటావా! దొంగముండా! అని అప్పుడే పైటలో ముడి చూశాడు డాక్టర్—

డబ్బులుంచుకునే లేవంటావే! అని విప్పి చూశాడు రూపాయి కాసు— జేబులో వేసుకున్నాడు—

వెళ్ళవే! వెళ్ళకపోతే బయటకు గెంటిస్తా!

పనివాళ్ళని పిల్చి బయటగెంటించాడు—

నువ్వే చంపావురా! నా బిడ్డని— నువ్వే చంపావ్—

అరుస్తూ రోడ్డుమీద పడింది—

బుజంమీద చల్లని ఐస్ గడ్డకట్టినట్లు సిన్నోడి శవం—

అన్నిటిలోనూ తానే ఓడిపోయింది—

సిన్నోణ్ణి బతికించుకోలేకపోయింది—

నీరసంగా గుడిసెకు చేరుకుంది— పిన్నోణ్ణి చాపమీద పడుకోబెట్టి అలాగే తాను కూర్చుంది—

అంతా శూన్యంలా అన్పిస్తుంది— ఏడవడానిక్కూడా కన్నీళ్ళు రావటంలేదు—

సిన్నోణ్ణి చూస్తూ కూర్చుంది—

ఈలోగా తడక చప్పుడై మావ లోపలకొస్తున్నాడు—

ఏంటే ఆడికి ఇంకా బాగవలేదా, డాక్టరుకాడికి తీసుకెల్లలేదా!

నోటినుండి మాటలు నత్తినత్తిగా వస్తున్నాయ్—

ఏమన్నా పైసలుంటే ఇయ్యే చేయిచాపాడు రంగి ముందికి— బిడ్డ చచ్చిపోయేడు— ఇంకేముంది ఇవ్వడానికి అని చెప్పేందుకు రంగికి నోటమాట్రావడంలేదు—

లేవేంటే! పిలుత్తుంటే వులక్కుండా అట్టా కూర్చున్నావ్—

జుట్టుపట్టి లేవదీశాడు—

అప్పటికే, ఆ వూరి జమిందార్ అన్నమాటలు వాడి బుర్రలో మార్మోగుతున్నాయ్!

నీ రంగిని ఈ రాత్రికి తీసుకురారా! నీకెంత కావలిస్తే అంతిస్తా అని!— జుట్టుపట్టి లేవదీసి, రిక్షాలో కూర్చోబెట్టాడు—

ఎక్కడికో అర్థం కాలేదు రంగికి— ఈ ప్రపంచంతో సంబంధంలేనట్లు కూర్చుంది—

రిక్షా తిన్నగా జమిందారుగారి బంగ్లాకు వచ్చింది—

ఈ బంగ్లాలో జరిగేవన్నీ ఆ ఊరి ప్రజలందరికీ తెల్సు— కానీ ఎవరూ నోరెత్తరు—

మొన్నటికి మొన్న తన పక్క గుడిసె మంగ జీవితం ఆ రాత్రితోనే తెల్లారింది—

ఇప్పుడు తాను మరోసారి మోసపోతోంది— అదీ తన మొగిడి సేతులమీదుగా—

అంతే ఒక అంగలో రిక్షాదూకి పరుగున చీకట్లోకి దూసుకుపోయింది— వెనుక పట్టుకోండి, పట్టుకో— అని అరుస్తూ ఓ నలుగురు మనుషులు— వారి అరుపులకు దూరంగా—

ఈ ప్రకృతిలోకి తాను కన్న బంగారు సిన్నోడి వద్దకు వెళ్ళిపోయింది రంగి.

తెల్లవారింది—

పక్షుల కువకువలతో—

దిగుడుబావిలో శవం తేలుతూ కన్పడింది—

పేపర్ వాళ్ళకు ఓ చిన్న న్యూస్—

బోఫర్ సమస్యకాదు—

పదవికోసం ప్రాకులాటకాదు—

జాతీయ సమస్యకాదు— అంతర్జాతీయ సమస్య అంతకంటే కాదు— అందుకే ప్రకృతి స్తంభించలేదు—

కాలం ఆగిపోలేదు.

కానీ

పనిమనిషి వచ్చిందట! ఇంకొక మనిషి కుదిరేవరకూ తానే ఆ పనులన్నీ చేసుకోవాలని మాత్రం

ఆ ఇల్లాలు బాధపడింది—

చావా రామకోటి



# క్రయిం డయిరీ

## ఇది పురుష అహంకారం!

భ తనకు వేరే స్త్రీతో సంబంధం ఉన్న సంగతి భార్యకు తెలిసి నిలదీసి ప్రశ్నించిందన్న ఉక్రోషంతో తలపై రోకలిబండతో మోది చంపిన సంఘటన ఈ మధ్య జీడిమెట్ల గ్రామంలో జరిగింది.

బాల నర్సింహ(35) ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసే కార్మికుడు. తాగుడు అలవాటుంది. వేరే స్త్రీతో అక్రమ సంబంధం కూడా ఏర్పడింది. అక్రమ సంబంధం సంగతి ఎంతకాలం దాగుతుంది? అతని భార్య భారతమ్మ (30)కు కూడా తెలిసిపోయిందీ సంగతి. ఆరోజు బాల నర్సింహ తప్పతాగి తూలుతూ ఇంటికి వచ్చాడు. అసలే కోపంగా వున్న అతని భార్య భారతమ్మ భర్తను నిలదీసింది. అతనికి వేరే స్త్రీతోగల అక్రమ సంబంధం గురించి సూటిగా ప్రశ్నించింది. బండారం బయటపడిందని ఉక్రోషంతో రెచ్చిపోయిన బాల నర్సింహ పక్కనే ఉన్న రోకలిబండతో భార్య తలపై మోదాడు. ఆమె తల పగిలి అక్కడికక్కడే మరణించింది. రక్తంతో తడిసిన రోకలిబండతోసహా జీడిమెట్ల పోలీసుస్టేషన్‌కు వెళ్ళి బాల నర్సింహ పోలీసులకు లొంగిపోయాడు. ఇన్స్పెక్టర్ అనంతరెడ్డి పర్యవేక్షణలో దర్యాప్తు జరుగుతోంది.

## తల్లి తప్పుకు తనయుడి బలి


తన తల్లి అక్రమ సంబంధాన్ని అడ్డుకోకుండా, పరోక్షంగా ప్రోత్సహిస్తున్నాడనే అపోహతో పన్నెండేళ్ళ బాలుణ్ణి బంధువులే సజీవంగా దహనం చేసిన సంఘటన నాగులపల్లి గ్రామంలో జరిగింది.

షాద్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని నాగులపల్లి గ్రామ నివాసి శ్రీమతి చిల్కమర్రి చెన్నమ్మకు అదే గ్రామానికి చెందిన నల్లపురం లక్ష్మారెడ్డికి అక్రమ సంబంధం ఏర్పడి గత పది సంవత్సరాలుగా నిరాటంకంగా కొనసాగుతోంది. ఈ విషయం ఆ గ్రామంలోని చిన్న, పెద్దలందరికీ తెలుసు. గతంలో ఓసారి గ్రామ పెద్దలంతా సమావేశమై వీరిరువురి అక్రమ సంబంధం గ్రామ వాతావరణాన్ని కలుషితం చేస్తుందనీ, ఇకముందు అలా జరుగనీయరాదనీ తీర్మానించి వారిరువురి అక్రమ సంబంధం కొనసాగకుండా కట్టడి చేసినా చెన్నమ్మ, లక్ష్మారెడ్డిలు దొంగచాటుగా కలుసుకుంటూ తమ సంబంధాన్ని కొనసాగించారు. ఈ మధ్య శనివారంనాడు చెన్నమ్మ బంధువర్గం ఆమెతో తగాదాపడ్డారు. ఈ అక్రమ సంబంధం తమ కుటుంబ గౌరవం మంటగలుపుతుందన్నారు. నలుగురులో తలెత్తుకోలేనంతగా పరువు పోయిందన్నారు. ఇంకా నానా మాటలతో తిట్టిపోసారు. చెన్నమ్మ పెద్దకొడుకు చిల్కమర్రి యాదయ్య (12) తన తల్లిని బంధువర్గం దూషించటం చూసి అడ్డుపడ్డాడు. తన తల్లిని ఏమీ అనవద్దని నచ్చజెప్పాడు. అదేరోజు మధ్యాహ్నం చెన్నమ్మ భర్త ఇంట్లో లేని సమయం చూసి ఆ అవకాశం సద్వినియోగం చేసుకునేందుకు లక్ష్మారెడ్డి ఆమె ఇంట్లో దూరాడు. అది గమనించిన ఆమె బంధువర్గం అదే అదనుగా భావించి బయట గడియవేసి బంధువర్గాన్నంతా జమచేసి చెన్నమ్మనూ, లక్ష్మారెడ్డినీ తాళ్ళతో కట్టివేసారు. చెన్నమ్మపై కిరోసిన్ పోసి, ఆమెను సజీవ దహనం చేయాలని నిర్ణయించారు. ఆమె కొడుకు యాదయ్య తల్లిని రక్షించుకునే ఉద్దేశ్యంతో బంధువుల ప్రయత్నానికి ఎదురునిల్చాడు. దాంతో కోపోద్రిక్తులైన బంధువర్గం అసలు వీడే తల్లి అక్రమ సంబంధానికి కాపు కాస్తున్నాడనుకుని ఆ బాలునిపైనే కిరోసిన్ చల్లి నిప్పంటించారు. యాదయ్య ఆస్పత్రిలో కన్నుమూసాడు. యాదయ్య తల్లి చెన్నమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై షాద్‌నగర్ పోలీసులు, సజీవదహనానికి పాల్పడిన చిల్కమర్రి పోచయ్య, చిల్కమర్రి గణేష్, చిల్కమర్రి చంద్రయ్య, చిల్కమర్రి రామయ్య, రంగమ్మ, రాములమ్మ, పద్మ, జంగమ్మ, అనంతమ్మలపై హత్య కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్షుద్రవ్యక్తులకు యావజ్జీవ శిక్ష

పోస్టల్ అకౌంట్స్‌లో పనిచేసే హరిగోపాల్, అశోక్‌నగర్ నివాసి మాధవరావులు కలిసి చిక్కడపల్లి పి అండ్ టి కాలనీలో నివసిస్తున్న శ్రీమతి సి.హెచ్.సుజాత (25)ను క్షుద్రశక్తులు పారద్రోలటంలో తమకు తామే సాటియని నమ్మించారు. తాము గొప్ప మంత్రగాళ్ళమని ఆమెను నమ్మించారు. ఆమె భర్త ఇంట్లో లేని సమయంలో మూడురోజులపాటు పూజలు నిర్వహించాలని ఆమెకు నచ్చచెప్పారు. 1989 నవంబర్ నెలలో పూజలు మొదలుపెట్టి పూనకం పేరుతో శ్రీమతి సుజాతను మూడురోజులపాటు చిత్రహింసలకు గురిచేసి హతమార్చారు. ఆమె మృతదేహాన్ని ఆమె ఇంటి పెరట్లో పడవేసి, గడియపెట్టి ఇరువురూ పారిపోయారు. చిక్కడపల్లి పోలీసులు రంగంలోకి దిగి కేసు నమోదు చేసుకుని నేరస్తులిరువురిని అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచారు.

రెండవ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి శ్రీ ఎస్.సాంబశివరావు ఈ కేసు పూర్వాపరాలు కూలంకషంగా విచారించి నేరం నిరూపించబడినందువలన హరిగోపాల్ మాధవరావులకు యావజ్జీవ కారాగార శిక్ష, చెరి వేయి రూపాయల జరిమానా విధించారు. *






## గ్రేట్

హీరోయిన్ నదిలో దూకబోతుంది.

ఈమధ్య అమితాబ్ అచ్చు సినిమాల్లోలాగానే రాఖీని రక్షించాడు. స్విమ్మింగ్ పూల్‌పై కట్టిన స్టేజీమీద ఒక అవార్డు ఫంక్షన్ జరుగుతోంది. రాఖీ స్టేజి చివర్లో నించుంది. ఆమె ఏ కొంచెం తూలినా నీళ్ళలోకి పడిపోవడం ఖాయం. ఇది గమనించిన అమితాబ్ ఒక్కంగలో ఆమెను చేరుకుని రాఖీని పట్టుకున్నాడు. ఎంతైనా అమితాబ్ గ్రేటే.

—ఎన్.జయంతి